ఉద్యోగ వాంఛ

౧

వెంకట్రాయుడు పాతికేళ్ళమనిషి. వాళ్ళవూరి వీధిబడిలోనే చదువుకుని ప్రైమరీపరీక్ష యిచ్చాడు. అంతటితోసరి! చదువుకోటాకు వేసింది. గుండాభాయి జట్టులో తిరిగి కొన్నాళ్లు పెద్ద రౌడీ అనిపించుకున్నాడు. చిప్పకాయల్లో ఫస్టురకం. కొన్నాళ్ళకి సంసారభారం తనమీదపడ్డాది. ఏంచేస్తాడుయిక ? వుద్యోగానికి చాలా ప్రయత్నించేడు. యెక్కడా దొరకలేదు. దొరికేదాకా వూరికేకూచుంటే కడుపు గడవడమెట్లా ? తను పస్తుపడుక్కుంటే సరిపోతుందా? తల్లీ! పెళ్లామూ యేమూతారు? ఆలోచించి! ఆలోచించి రాయుడు స్వంతసేరీ వ్యవసాయం పెట్టాడు. కాస్తోకూస్తోపండుతున్నాది. యెల్లాగో వుందీ అవక, లేదూఆవక కాలక్షేపం జరుగుతున్నాది. ఉగ్రతిరుగుడుకూడా చాలామట్టుకు తగ్గింది.

రాయుడుకి ఏమీ తృప్తిలేదు. వుద్యోగంచెయ్యాలని ఆతనిపట్టుదల. ఎలాగన్నా సంపాదించితీరాల్సిందే. ఎవరేనా పెద్దవుద్యోగస్తులు ఆవూరికివస్తే, పన్లయిచేసినా, చెయ్యకపోయినా అటూ యిటూ తిరిగి హడావుడిచేస్తూ,చాలాకష్టపడి పని చేస్తున్నవాడిలా తోపించేవాడు అధికార్లకి. వాళ్లయెదటనే మునసబుకీ, కరణానికీకూడా యేవో పన్లయిపనులు పురమాయించేవాడు మహాపలుకుబడివున్న వాడిలాగ. యిల్లాగే. తహసీల్దారు, మేజిస్ట్రీటు మొదలైనవారిదయ సంపాదించుకున్నాడు. సమయం చిక్కితే ఏదన్నా వుద్యోగం పారెయ్యరా అని అతగాడి వుద్దేశం. రోజూ పోస్టాఫీసుకెళ్లి తనకేమైనా కవరుత్తరాలు, ఉద్యోగస్థులురాసినవి వస్తాంటాయేమో అని రోజూ చూసేవాడు.

ఎలాగైతేనేం వచ్చిందో సర్వీసుకవరుత్తరం ఒకనాడు. అవ్వాళ్లో పోస్టుమేష్టరు అక్షరాలు కూడబలుక్కుని ఆయింగిలీషు చిరునామాచదివి వెంకట్రాయుడికి యిచ్చేడు. రాయుడు ఆతురతగా అందుకుని పొంగిపోయేడు. రోజూకుంటూ తిరిగి దాన్ని పోస్టుమేష్టరుకిచ్చి 'యెవరిదగ్గిర్నించి వచిందో చూసి చెప్పండీ!' అని బతిమాలుకున్నాడు, తనకు ఆమాత్రం యే, బీ, సీ, డీలూ రాకపోవడంవల్ల. అతను ఐదు నిమిషాలు పరకాయించిచూసి 'మేజిస్ట్రీటుగారి దగ్గర నుంచి' అని చెప్పాడు. రాయుడు వెంటనే అతని చేతులోంచి ఆకవరు లాక్కుని ఒక్కగంతు వేశాడు. పోస్టుమేష్టరు 'ఏమిటయ్యా సమాచారం!' అంటూ వుండగా- 'చెప్తా మళ్లీవొచ్చి',అని గాభరాగా యింటికి పరుగెత్తాడు. తనగదిలో ప్రవేశించి తలుపుగడియవేసుకుని ఒక కిరసనాయిలుదీపం వెలిగించి (ఆవూరింటిగదికి కిటికీలు లేవులెండి, తెరవడానికి) జాగర్తగా కవరువిప్పి లోపలికాగితంచూసేడు. దైవం రక్షించి అది తెలుగు నేవుంది. అది ఒకసారికాదు, పదిసార్లు చదువుకున్నాడు. పరమానంద సముద్రంలో మునిగిపోయి ఐదునిమిషాలు స్పృహతప్పిపోయాడు. తెలివివచ్చాక 'అమ్మోయ్!' అని అంటూ గది

లోంచి వసారాలోకి ఒక్కదుముకు దుమికాడు.

'ఏమిట్రాబాబూ! నాయనా! ఏమయిందిరా?' అని అరుస్తూ కాళ్లు గజగజవొణుకుతూ తల్లి వచ్చింది.

రాయుడు రోజుతూ 'మరేం కాదమ్మా! ఉద్యోగం! నాకు వుద్యోగమైంది! యిదుగో ఆర్డరువచ్చింది.' అంటూ ఆ కాగితం చూపెట్టాడు.

ఆవిడ ముఖం చేటంతయింది. తలవిూంచి జారిపోతున్న ముసుగుని సర్దుకుంటూ 'ఉండ్రా! నాయినా! పెరట్లో నూతిదగ్గిర కోడలుంది. యీసంగతి చెప్పిరస్తాను' అని వెళ్లబోయింది.

రాయుడు—వుండమ్మా! నీనోట్లో నువ్వుగింజ నానదు! అప్పుడే యేంతొందరమ్మా! క్రమంగా దానికే తెలుస్తుందిలే!

తల్లి—అయితే నీయిష్టమేకాని. బాబూ! జీతమెంతరా?

రాయుడు—నెల 1 కి తొంభైవొక్క రూపాయిలు! ఏ ఎమ్మేలకీ, బియ్యేలకీ వుండమ్మా యింత జీతం?

తల్లి—అవున్రా నాయినా! అదృష్టంచేసుకు పుట్టాలిగాని చదువులో యేముందీ? చూడూ! వాళ్ళరామిగాడు బియ్యేఅయికూడా ఉద్యోగం, సద్యోగంలేకుండా ఇంటోకూచున్నాడు। పోనీ! యిన్నాళ్ళకి మనదరిద్రం తీరిందిలే. ఎవరువేశేరు బాబూ వుద్యోగం?

రాయు—ఎవరేమిటే? మన మేస్ట్రీటుగారు! నామీద ఆయనకి చాలాదయ! తక్కువజీతం పని అయితే నేను వొప్పుకుంటానో వొప్పుకోనో అని పెద్దవుద్యోగమే పారేశాడు!

తల్లి—యేంవుద్యోగం బాబూ!

రాయు—ఏమిటో యింకావివరం తెలీలేదు. ఏమిటుంటుంది? యీమునసబులమీదా, కరణాలమీదా అధార్టీ చెలాయించి, పల్లె యిల్లోనూ తదితరాల్లోనూ పనిపుచ్చుకోడమైవుంటుంది. మొన్న నేను మేస్ట్రీటు దగ్గిర మునసబుపైని దావత్తు చెలాయించి గడగడలాడించేను. మేస్ట్రీటు హడలెత్తిపోయాడు. యిలాంటివాడిని చేతులో వుంచుకోవాలంటూ, అల్లాంటి మునసబుగాళ్ళని అణచివుంచడానికి వుద్యోగం వేసివుంటాడు. ఇక నాతడాఖా బాగా చూపిస్తాను, మునసబులందరికీ.

తల్లి—వుద్యోగం వుద్యోగం అంటూ పట్టుపట్టుకు కూర్చుని సాధించేవురా బాబూ! నువ్వే బహాద్దరువి!

౨

గదిలో మంచంమీద వెల్లకిలాపండుకుని వెంకట్రాయుడు ఏవో ప్లానులువేస్తున్నాడు. ఇంతట్లో ఇత్తడిచెంబులో మంచినీళ్లుతెచ్చి మంచంక్రింద పెట్టి బుచ్చెమ్మ తలుపుగడియవేసి మెల్లిగా మంచం దగ్గిరికి వెళ్ళింది.

బుచ్చె—ఏమిటలా ఆలోచిస్తున్నారు? పెళ్లానికి ఏంనగలు చేయించేదా అనేనా?

రాయు—నగలకేంలోటే బుచ్చీ! నీకు రెండు నెల్లు వోపికపట్టు. ఒళ్ళంతా బంగారం మలామా చేయిస్తాను. మొదటి రెండునెల్ల డబ్బూపెట్టి నా ఆఫీసు వస్తువులు, డ్రెస్సులు, ఏర్పాటుచేసుకోవాలి! చిల్లరప్పులు తీర్చెయ్యాలి. ఒకయేడాది యింటిఅద్దె పారెయ్యాలి!

బుచ్చె—ఇంటిఅద్దె ఏమిటండోయ్!

రాయు—ఇంతపెద్ద వుద్యోగస్తుడను అని అనిపించుకోని, యీపూరికొంప అరుగులమీద కచ్చేరీ చెయ్యమన్నావా! సిగ్గుసిగ్గు! వచ్చే వుద్యోగస్తులూ, పోయే వుద్యోగస్తులూ చూసి యేమిటనుకుంటారు? అందుకనే పెద్దినాయుడుతో మాట్లాడాను. వాళ్ళ మేడమీది గదులు ఒకయేడాదిదాకా నాస్వాధీనం చెయ్యడానికీ. యేభై రూపాయిలు ముట్టచెప్పడానికీ నిర్ణయించాను. ఎల్లుండినించీ నేను అక్కడే మకాము. భోజనానికి యిక్కడికి వస్తావుంటాను.

బుచ్చె—మేమూ అక్కడికేవస్తాం.

రాయు—వీల్లేదు. కాపువాళ్ళయింటో మీరెలా

304

వంటూ, పెంటూచేస్తారు? ఒక్కయేడాది వోపిక పట్టండి. యీలోపుగా యిక్కడే ఒక భవంతి లేవదీస్తాను.

బుచ్చి—అదుగో! అదొకటి తలపెడితే నాకు వస్తువులు వచ్చేటట్టే ఎందుకూ ఆబద్ధాలు మాటలాడడం?

రాయు—భవంతి కట్టించేమంటే ఎక్కువసొమ్ము పోతుందనా నీవూహా! వెట్టికూలీలు, వెట్టికంసాళ్లు, వెట్టితాపీవాళ్లు దమ్మిడీ ఖర్చులేకుండా పనిచేస్తారు. కలప పూరికే సంపాదించొచ్చు. ఇక దానికి డబ్బు ఎందుకు ఎక్కువ అవుతుంది? పలుకుబడివున్న వాడిని, నాకే కర్చవుతుందేమి? వెట్టివాళ్లు పని చెయ్యకపోతే ఎరగరూ నామజా.

బుచ్చి—బాగావుంది! ఇకమనకేంలోటూ! కాని మీచేతికింద ఏదైనా పనికలిసివస్తే మా అన్నయ్యకి పని చేయించరూ? బియ్యేదాకా చదివి ఊరికే వున్నాడు. మీపేరు చెప్పుకుని మావాళ్లు హాయిగా బతుకుతారు.

రాయు—చూదాంలే అప్పటిసంగతి! చదువంటే-యేదో-చదువుకుంటారుగాని యీ, బియ్యేలకీ, ఏళ్ళకీ లోకజ్ఞానం అనేది తక్కువ.

బుచ్చి—దైవం రక్షించి మనకో కాయకాస్తే అది ఆడుకుందికి వోతొక్కుడు మోటారూ, సైస్కూలుబండీ కొంటారుకదూ!

రాయు—ఓస్! ఆపేఅబ్బురమా! ఇంకెందుకూ? యీయేడాది, యిల్లయితే, మరోయేడులో గుర్రపుబగ్గీ మనకి రావనూ?

బుచ్చి—(సంతోషంతో) యేం అదృష్టవంతురాలివమ్మా నేను? నాపూజలు యిన్నాళ్ళకి ఫలించాయి! యిక మాకేమిటి తక్కువ?

3

రాయుడుతల్లి వెంకమ్మ పెరటిపంచ దగ్గిర తులసికోటపక్కని కూచుని పత్తివత్తులు చేస్తూవుంటుంది. పక్కవీధి సుబ్బమ్మ 'వెంకమ్మక్కా! అని పిలుచుకుంటూ వస్తుంది. యిదివరకు ఆప్యాయంగా జబాబిచ్చి కూచోమని చెప్పే వెంకమ్మ పలకనవ్వా పలకలేదు. సుబ్బమ్మ వెంకమ్మపక్కని నుంచుని మళ్ళీ పిలిచింది.

వెంక—నువ్వటే సుబ్బీ! పరధ్యానంగా వున్నాను, మాట వినిపించడంలేదు! కూచోవే!

సుబ్బ—(కూచుని) ఏమే! చెప్పవన్నా లేదూ, మీరాయుడికి వుద్యోగమయిందని!

వెంక—(విసుగుతో) నిన్ననేగదటే కాగితం వస్తే. అప్పుడే యెక్కడచెప్పేదే? ఏం లోకమమ్మా! అప్పుడే యెలా పొక్కిపోయిందో!

సుబ్బ—తెలిస్తేయేమే! సంతోషించేవాళ్ళమే గాని, దుఃఖపడేవాళ్ళం కాదుగదా మేము!

వెంక—నీసంగతికాదే! చెప్తున్నాను లోకంరీతి! ఎంత కష్టపడ్డాడనుకున్నావ్ ఆవుద్యోగానికి! తొంభై వకటికాదు, తొమ్మిదివందలు జీతంచేసినా ఆ కష్టానికి చాలదు. ఏమనుకున్నావో గాని!

సుబ్బ—తొంభయ్యొకటూజీతం! ఏం అదృష్టవంతురాలమ్మా, అత్తా కోడళ్లూనూ, మా అభాజనం బియ్యేచదివీకూడా యింటోకూచున్నాడు, పనీలేక బండలూలేక. 'ఏమిరా! పనికి చూస్తున్నావురా' అంటే తెల్ల మొగంవేస్తాడు. అస్తమానం పెళ్లాన్ని ఎదురుగుండా కూచోపెట్టుకుని కబుర్లు చెప్పమంటే చెబుతాడు. ఎందుకొచ్చినకబుర్లు! మీవాడు ఆ యింగ్లీషు ఏమీ రాకపోయినా నూరురూపాయిల వుద్యోగం యెడంచేత్తో సంపాదించేడు!

వెంక—ఎందుకే ఆ పీచుపీచు చదువులు! డబ్బు దండక్కాగాదే! ఏమిటిలాభం! యింతకీ అదృష్టముండాలిగాని చదువులేం పనిచేస్తాయే?

సుబ్బ—నిజమేనక్కా! మారోజులు యెలా తెల్లారతాయో అని బెంగపట్టుకుంది. ఉన్న మడిచెక్కలు పీడి చదువుకోసం బుగ్గిలో కలిపివేసేం. దారీ, తెన్నూ తోచలేదు.

వెంక—విచారించకే సుబ్బీ! మావాడితో చెప్పి

యేదన్నా కిందిపని కలిసొస్తే తప్పకుండా మీవాడి సంగతి చూసేటట్టు చేస్తాను. ఆపైన మీఅదృష్టం!

సుబ్బ—సరేనమ్మా! అలా ఏదేనా చేయిస్తివట్టాయనా, నీమేలు మరిచిపోను. నాశరీరం నీకు చెప్పులు కుట్టియిస్తా. మరిచిపోకేం?

వెంక—ఎంతమాటన్నావే?

౪

[రామారావు యిరవై రెండేళ్ళమనిషి. బి.య్యే పేసయి ఏడాదిఅయింది. ఎక్కడా వుద్యోగం దొరక్క యింటోనే ఉన్నాడు. 'హిందూ' పత్రిక 'వాంటెడ్' కలములుచూస్తూ వసవలో మడతకుర్చీలో కూచుని వుంటాడు, గదిగుమ్మాని కెదురుగా. గదిలో ఆతనిపెళ్లాం పద్మ సింగారం పూర్తిచేసుకుని గుమ్మందగ్గిర నిలబడివుంటుంది.]

పద్మ—ఎవర్తికేనా కలుగుతుం దదృష్టం, నాలాంటి దరిద్రదేవతకి తప్ప!

రామా—(పత్రికమడిచి) ఏ మొచ్చిం దేమిటిప్పుడు?

పద్మ—పెళ్ళయి నాలుగేళ్ళయింది—కాపరాని కొచ్చి యేడాదిపైగా దాటింది. నగా, నట్రా, ముద్దూ, ముచ్చటా, ఏమన్నా తీరాయా? మీరే ఆలోచించండి. బుచ్చెమ్మచెప్పింది, వాళ్లాయనకి పెద్ద వుద్యోగం అయిందట! ధవంతికట్టెస్తారట! ఒళ్లు బంగారం మలామా చేయిస్తాడట! బగ్గీలూ, మోటారులూ కొంటాడట! దానిదే అదృష్టంగాక! మీరు పెద్దచదువులు చదివినా కానీ వుద్యోగమే నా లేదు.

రామా..............

పద్మ—నగా, నట్రాసంగతీ అలావుండనీండి. మీకుతోడు నేనుకూడాను, పీళ్ళపీకమీదికి. ప్రతిరోజూ రుసరుసలే పట్టెడన్నానికి! ఏదేనా చిన్న పనేనా సంపాదిస్తే యీబాధ తప్పిపోతుంది.

రామా..............

పద్మ—బుచ్చెమ్మచెప్పిందిలెండి! ఏదేనా, ఆయన కింద పనికలిసొస్తే మీకు యిప్పిస్తుందట!

రామా—ఎవరిసంగతే చెప్తున్నావు నువ్వు!

ఇంతట్లో రామారావుతల్లి సుబ్బమ్మవస్తుంది. కోడలు గదిలోకి పోతుంది. సుబ్బమ్మ రామారావుని చూసి

'ఏమిరా రామం! పొట్టికాగితాలేనా, యేమన్నా వుద్యోగాలు ఖాళీపడిన వున్నాయా! ఎందుకురా డబ్బుఖర్చుకి, ఆ చేటకాగితాలూ?" అంటే 'యిందులోనే వున్నది నాభవిష్యత్తంతా' అంటూ డబ్బు తగలేస్తున్నావు. ఏం డబ్బు ఖర్చుపెట్టేడని, ఆ రాయుడికి, పెద్దవుద్యోగం దొరికింది? ఇంగిలీషు ముక్కలన్నా రెండురావు. యింతికీ, నేంచేసుకున్న అదృష్టం! బోలెడు ఖర్చుపెట్టి - మడిచెక్కలమ్ముకుని- చదువుచెప్పించి, చివరకి తిండికికూడా కష్టపడిపోతున్నాం. నువ్వు పనీ పాటూ లేక పెళ్లాంతో కబుర్లుచెప్పకుంటూ నిర్భాగ్యపు దామోదరపెద్దమ్మవి తయారయావు' అంది.

రామారావుకి వొళ్లుమండిపోయింది ఏ చెయ్యగలడు? ఆపాళంగా యిల్లువిడి పోదామనుకున్నాడు —కాని, కట్టుకున్న పెళ్లాంగతి ఏమౌతుంది? అంచేత శాంతంవహించక తప్పిందికాదు.

సుబ్బ—తొంభై వక్కరూపాయిలట వుద్యోగం వాళ్ళసంగతీ, సందర్భమూ చూస్తే ఎంతో ముచ్చటయింది.

రామా—తొంభై వకటి జీతమూ ఏంచదివేడని?

సుబ్బ—చదువెందుకూ, అదృష్టముండాలిగానీ.

రామా—నాకేమీ అర్థంకాలేదు. ఏవుద్యోగం? ఎక్కడేమిటి?

సుబ్బ—ఎక్కడేమిటి? యీవూళ్లోనే. అదేం వుద్యోగమో, చదువులూ, చట్టుబండలూ యేడిసిన మీకు తెలియాలి. నాకేం తెల్సు?

రామా—ఇదంతా ఓగారడీలాగుంది యదార్థం తెలుస్తేగాని నమ్మకంలేదు.

సుబ్బ—అవును నీకు పనిలేకపోతే, ప్రపంచంలో మరి ఎవరికీ పనికాదనేవ్వూహా ఏడిశావు దద్దమ్మవి.

(పోవును)

రామా—ఏ, బీ, సీ, డీలు రాని దద్దమ్మకి, 91 జీతమేమిటీ, అదీ యిలాంటి పల్లెటూళ్ళో నే యేమిటీ, వీళ్ళంతా అదినమ్మి నన్ను ఎత్తిపొడవడమేమిటి? ఇదో నాటకంలాగుంది. రిసెర్చిచేసి ఫలితాలు కనుక్కోవాలి.

ጰ

రాయుడు కుర్చీమీదకూర్చుని వుంటాడు. ఎదురుగా ఒక టేబిలు. పక్కని ఒక బెంచీ. రామారావు అక్కడికి వస్తాడు. రాయుడు 'కూచోరా, రామం' అని బెంచీచూపిస్తాడు. కొడుకుపోవడా చూడడానికి, తల్లి వచ్చి అక్కడే నుంచుంటుంది.

రామా—బాగుందిరా అబ్బీ నీసంగతి. తొంభయ్యొక్క రూపాయిల వుద్యోగం సంపాదించావట మేం, ఏంచదివినా, నీ కాలిగోరికి పోలం.

వెంక—ఇది మీఅందరిదయా, వాడి అదృష్టమున్నూ. నీకుమాత్రం పనికాకపోతుందేమిటి రాముడూ.

రామా—ఏం ఉద్యోగమేమిటి రాయుడూ.

రాయు—వాయుండి మునసబులమీద కరణాల మీదా, రివిన్యూ యినస్పెక్టర్లమీదా, అయివుంటుంది. ఆయింగ్లీషు మాటేమిటో నాను అర్థంకాలేదు. నువ్వు చూశి చెప్పు.

అని యింటోకివెళ్ళి కావిడిపెట్టి తాళంతీసి 10 కవర్లలో దాచిన ఆర్డరుకాగితం తెచ్చి రామారావు చేతిలో పెట్టాడు. దాన్నిచూడగానే రామారావుకి పట్టరాని నవ్వొచ్చింది. ఆపుకోలేకపోయాడు. 'యీవుద్యోగమట్రా' అని నవ్వేసేడు— కడుపు చెక్కలయ్యేటట్లు.

రాయుడూ, తల్లీ నిర్ఘాంతపోయారు. కోపం కూడా కొంచెం వచ్చినట్టుంది, ఆవాలకం చూస్తే. ఇంతలో, యేదోపుట్టి మునిగిపోయినట్లు బుచ్చెమ్మ కూడా వచ్చింది.

రాయు—యేమిరా అలాఅంటున్నావ్?

రామా—ఇది, ఎన్యూమరేటరు వుద్యోగం జనాభా లెక్కలు రాయడం దీనికి జీతం, బత్తెంవుండవు. నె 91 రు. అంటే నెలకి తొంభయ్యొక్క రూపాయి జీతం కాదు. తొంభయ్యొకటో నెంబరు వాడి వన్న మాట నువ్వు!

వెంక—ఐతే యిది వుద్యోగమేనా

రామా—వుద్యోగమే—చెప్పలేదూ జీతం, బత్తెం వుండవని.

బుచ్చె—జీతం, బత్తెంలేనివుద్యోగం మీకెందుకండీ దండగ. నాకు అక్కర్లేదని రాసేయండి మేస్త్రీటుకి.

రామా—అక్కర్లేదంటే వొదిలే వుద్యోగంకాదిది. చేసితీరాలి.

రాయు—ఇదా, నాకు మేస్త్రీటుతో వున్న పరిచయానికి ఫలం?

వెంక—అక్కర్లేదంటే—యేంజేస్తాడేమిటి?

రామా—యేంజేస్తాడా? జైలులో కూచోపెడతాడు.

వెంక—, బచ్చె—రాయు— (వణుకుతూ) జై...లే!

—"రావు"

ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలుచందా రు 3. విడిపత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మా అంతటను ప్రచారము గలదు. వర్తకులిందు తమసరకుల ప్రకటించిన మంచి లాభమును పొందగలరు. వివరములకు :

ఎడిటర్, "ఆంధ్రజ్యోతి"

185, లోవర్ మెయిన్‌రోడ్డు,

మోల్మేన్-అని వ్రాయుడు.